తహసీల్దార్ డీఆర్ డిపో ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని డిఆర్‌డిపోను బుధవారం తహసీల్దార్ ఖలీల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం నిల్వల రిజిస్టర్‌ను పరిశీలించారు. షాప్ ఎదుట పేరు, ధరల పట్టిక లేకపోవడంతో ప్రజలకు ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. వెంటనే పేరు, ధరల పట్టిక రాయించాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ నాగోరావ్, డీలర్ ప్రశాంత్ ఉన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
గురువారం | సెప్టెంబర్ 12, 2024 | www.navatelangana.com

ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించాలి

నవతెలంగాణ-జైపూర్

జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణగౌడ్ అన్నారు. కలెక్టర్, డీపీఓ ఆదేశాలను అనుసరించి గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజు ఉదయం 7గంటల లోపు విధుల్లో ఉండాలని సూచించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు చేపట్టాలని తెలిపారు. మురికి కాలువలు శుభ్రం చేయడం, నీటి నిల్వలు ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయించడం, బ్లీచింగ్ పౌడర్ చల్లించడంతో పాటు పినాయిల్‌తో పిచికారి చేయించాలని తెలిపారు. దోమల వ్యాప్తిని నిరోధించడానికి ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఫాగింగ్ చేయించాలని, బ్లీచింగ్ పౌడర్, సున్నం, బయోటెక్స్, స్ప్రే పంపులు, గ్రాస్ కటింగ్ మిషన్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

తప్పిన బిల్లుల భారం..!

- సర్కారు విద్యాలయాలకు ఉచిత విద్యుత్తు సౌకర్యం
- ఈ నెల నుంచే అమలుకు ప్రభుత్వం ఆదేశాలు
- పెండింగ్ బకాయిలు చెల్లించలేక తీవ్రంగా సతమతం
- తాజా నిర్ణయంతో బడులు, కళాశాలలకు ప్రయోజనం

సర్కారు విద్యాలయాలకు కరెంటు బిల్లుల భారం తప్పనుంది. ప్రభుత్వ విద్యాసంస్థలన్నింటికీ ఉచిత విద్యుత్తు సౌకర్యం అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతో పాటు గురుకులాలు తదితర విద్యా సంస్థలన్నింటికీ ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది. తాజా ఉత్తర్వులను ఈ నెల నుంచే అమలు చేయాలని ఆయా సంస్థలకు ఆదేశాలు జారీచేసింది. ఇన్నాండ్లు రూ.వేలల్లో వచ్చే విద్యుత్తు బిల్లులను చెల్లించాలంటే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో విద్యాశాఖ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మరోపక్క ఇది వరకు జిల్లాలోని విద్యాసంస్థలు విద్యుత్తుశాఖకు రూ.కోట్లలో పెండింగ్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. వీటిని సైతం ఆ సంస్థకు ప్రభుత్వమే చెల్లించనున్నట్లు తెలిసింది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సర్కారు విద్యా సంస్థలకు ప్రభుత్వం ఊరట కల్పించింది. విద్యాలయాలకు ఉచిత వెలుగులు అందించాలని నిర్ణయం తీసుకోవడంతో విద్యాశాఖవర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ఇది వరకు బడులు, కళాశాలల్లో నిర్వహణ, మౌలికవసతులకు ప్రభుత్వం అరకొర నిధులు విడుదల చేయడం.. వచ్చిన నిధులు కరెంటు బిల్లులు చెల్లింపునకే సరిపోతుండటంతో ప్రధానోపాధ్యాయులు తీవ్రంగా సతమతమయ్యారు. మరోపక్క ఐటీడీఏ పాఠశాలల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ప్రభుత్వం ఆ పాఠశాలల నిర్వహణకు సక్రమంగా నిధులు ఇవ్వకపోవడం మూలంగా నెలల తరబడి కరెంటు బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉండేది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని అనేక గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో విద్యుత్తుశాఖ అధికారులు బిల్లులు చెల్లించడం లేదనే కారణంగా కరెంటు సరఫరాను తొలగించిన సందర్భాలున్నాయి. దీంతో పాఠశాలల్లో ఫ్యాన్లు, టీవీలు ఉన్నా వృధాగా ఉండేవి. పాఠశాలల పరిస్థితి కూడా ఇదే విధంగా కనిపించేది. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, టీవీలు, తాగునీటి బోరు, కంప్యూటర్లు, ఇంటర్‌నెట్ తదితర సౌకర్యాల కోసం తప్పనిసరిగా విద్యుత్తు అవసరం ఉంటుంది. ఒక్కో పాఠశాలకు ఏడాదికి కనీసం రూ.20వేల నుంచి రూ.30వేల వరకు బిల్లులు వచ్చేవి. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడం, విద్యుత్తు బిల్లులు చెల్లించలేక ప్రధానోపాధ్యాయులు సతమతమయ్యేవారు.

తప్పనున్న బిల్లుల భారం..!

ప్రభుత్వ నిర్ణయంతో ప్రభుత్వ విద్యా సంస్థలకు విద్యుత్తు బిల్లుల భారం తప్పనుంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 3500వరకు పాఠశాలలు ఉండగా వీటి పరిధిలో 3.35లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వ కళాశాలలు 46వరకు ఉండగా డిగ్రీ కళాశాలలు 11వరకు ఉన్నాయి. వీటికి అదనంగా ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ గురుకులాలు, కేజీబీవీలు, మోడల్‌స్కూల్‌లు, సాంకేతిక కళాశాలలున్నాయి. వీటన్నింటికీ ఉచిత విద్యుత్తు వర్తించనుందని అధికారులు చెబుతున్నారు. ఇన్నాండ్లు ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలకు ఇప్పటి వరకు రూ.1.40కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండగా.. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించినవి రూ. 2కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పెండింగ్ బకాయిలను ప్రభుత్వమే చెల్లించనుందని తెలుస్తోంది.

జిల్లాలోని ఒక ప్రాథమికోన్నత పాఠశాలకు తాగునీరు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు తదితర వాటికి ప్రతి నెలా ఏటా రూ.10వేల నుంచి రూ.12వేల వరకు కరెంటు బిల్లు వచ్చేది. ఉన్నత పాఠశాలకు మరింత అదనంగా బిల్లులు వచ్చేవి. ప్రభుత్వం నుంచి వివిధ గ్రాంట్లు విడుదల కాకపోవడం.. వచ్చిన అరకొర నిధులు మౌళిక వసతుల కల్పనకే సరిపోవడంతో ప్రధానోపాధ్యాయులు కరెంటు బిల్లు చెల్లించాలంటే ఇబ్బందులు పడేవారు. తాజా ప్రభుత్వ నిర్ణయంతో బిల్లుల చెల్లింపు బాధలు తప్పనున్నాయి.

ప్రభుత్వ నిర్ణయంతో ప్రయోజనం : టి.ప్రణీత, జిల్లా విద్యాశాఖాధికారి, ఆదిలాబాద్



ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్తు సౌకర్యాన్ని కల్పిస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పాఠశాలలకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. వెంటనే అమలు చేస్తామని ప్రభుత్వం నుంచి తమకు సమాచారం అందింది.

వివరాలు సేకరిస్తున్నాం : జేఆర్.చౌహాన్, విద్యుత్తుశాఖ ఎస్ఈ



ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్తు సదుపాయం కల్పించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. వాటికి అనుగుణంగా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల నుంచి వివరాలు సేకరిస్తున్నాం. ఎన్ని మీటర్లు ఉన్నాయో సర్వే చేపడుతున్నాం.

ఉచిత విద్యుత్తు మంచి నిర్ణయం : వి.అశోక్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి



ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్తు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం మంచి నిర్ణయం. తాము గతంలో అనేక సార్లు ప్రాతినిధ్యం చేయడంతో వచ్చిన ఫలితమిది. సర్కారు బడుల్లో చదువుతున్న పేద వర్గాల పిల్లలకు ప్రయోజనం చేకూరుతుంది. డిజిటల్ పాఠాలు, కంప్యూటర్ ఆధారిత బోధన అందుబాటులోకి వస్తుంది.



అటవీ అమరుల త్యాగం చిరస్మరణీయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

అటవీ సంరక్షణ కోసం అమరులైన వారి త్యాగాలు మరువలేనివని జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ అన్నారు. మావల సమీపంలోని హరితవనంలో బుధవారం అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో అసువులు బాసిన అటవీ ఉద్యోగుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంరక్షణ ఉద్యోగులకు, అధికారులకు సవాల్ లాంటిదని, దాన్ని బాధ్యతగా నిర్వహించాలని పేర్కొన్నారు. అటవీ సంపదను కొల్లగొట్టే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ సంరక్షించే శ్రద్ధ వహించాలని సూచించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వ్య, ఎఫ్‌డీఓ రేవంత్‌చంద్ర, అటవీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేష్, ప్రశాంత్, ప్రవీణ్ మహాజన్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి



నవతెలంగాణ-తాండూర్

పెండింగ్ డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చక్రపాణి కోరారు. టీఎస్‌యుటీఎఫ్ సభ్యులతో కలిసి మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 5571 పిఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలని కోరారు. అకాడమిక్ ఇన్‌స్పెక్టర్లను నియమించి బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. సిఆర్‌టి, గెస్ట్, పార్ట్‌టైం, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల 12నెలల వేతనం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యోగులకు ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉన్న అన్ని రకాల సెలవులు వర్తింపజేయాలన్నారు. సిపిఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దేవిదాస్, మండల ప్రధాన కార్యదర్శి సంపత్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్రకటించిన హామీలు పక్కగా అమలు



నవతెలంగాణ-నార్నూర్

ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం పక్కగా అమలు చేస్తోందని జిల్లా కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం మాలేపూర్ చిత్తగూడ, బాబేఝరీ చిత్తగూడ, సుంగాపూర్ గ్రామాల్లో పర్యటించి రోడ్డు కల్వర్టు పరిశీలించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. రోడ్డు, వంతెన, నీటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత పాలకుల పాలనలో గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలాయని, తమ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ప్రజా పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికావద్దని, త్వరలోనే నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. 2లక్షల రుణమాఫీ అందరికీ అందుతుందని, సాంకేతిక సమస్యల వల్ల కొంతమంది రైతులకు ఆలస్యమవుతోందని తెలిపారు. ఆమె వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లోఖండే దేవ్‌రావు, షేక్ హైమద్, మాజీ సర్పంచులు పవార్ ఇందల్, మెస్రం దిగంబర్, మర్సకోల నాందేవ్, ప్రేమ్‌సింగ్, ఉపసర్పంచ్ బాపురావ్ ఉన్నారు.

అడవిపందిని ఢీకొని వ్యక్తి మృతి



ఇంద్రవెల్లి : మండలంలోని మెండపల్లి గ్రామానికి చెందిన హనుమాన్(35) బైక్‌పై వెళ్తుండగా అడవి పంది అడ్డు రావడంతో ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..మృతుడు ముత్నూర్ గ్రామంలో పాన్‌షాప్ నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ప్రతి రోజు మాదిరిగానే పాన్‌షాప్ మూసేసి మంగళవారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా రైతు వేదిక వద్ద ఆకస్మాత్తుగా అడవి పంది అడ్డొచ్చింది. దీంతో కిందపడిపోయి తలకు బలమైన గాయమైంది. తీవ్ర రక్త స్రావం జరిగి అక్కడికక్కడే మరణించాడు. రాత్రి కావడంతో ఎవరూ గమనించలేదు. రాత్రంతా రోడ్డు పక్కనే శవమై పడి ఉన్నాడు. బుధవారం తెల్లవారుజామున శంకర్‌గూడ గ్రామస్తులు మార్నింగ్ వాక్ వెళ్లగా చూసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా పనిచేస్తుండగా పలువురు బీజేపీ నాయకులు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు.

ఉద్యోగ నియామకాల్లో

బీసీలకు 50శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

నవతెలంగాణ-మంచిర్యాల



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద కండ్లకు నల్ల రిబ్బన్స్‌తో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 60శాతం బీసీ జనాభా ఉంటే కేంద్రంలో బీసీ ఉద్యోగులు 16శాతం మాత్రమే ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు 54 లక్షలు కాగా బీసీ ఉద్యోగులు 4.62లక్షలు మాత్రమే ఉన్నారన్నారు. ఇది బీసీలపై వివక్ష చూపించడమే అని అన్నారు. రాష్ట్ర జనాభాలో 56శాతం బీసీలు ఉంటే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో బీసీలకు కేవలం తొమ్మిది శాతం మాత్రమే రిజర్వేషన్ ఉందన్నారు. మండల కమిషన్ బీసీల ఉద్యోగాలలో 27శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నివేదిక ఇస్తే, 40 సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లను అమలు చేయడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు 76 సంవత్సరాలుగా బీసీలకు ఉద్యోగాలలో అన్యాయం చేస్తున్నారని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజులలో నిరుద్యోగ బీసీ యువత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గుమ్ముల శ్రీనివాస్, భీమ్‌సేన్, రాములు, రాజేశం, భిక్షపతి, అంకం సతీష్, చంద్రమౌళి, రాజన్న పాల్గొన్నారు.

నియర్ బై ఏరియా పోటీలను ప్రారంభించిన జీఎం

నవతెలంగాణ-మందమర్రి



వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నియర్ బై ఏరియా బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలను జీఎం దేవేందర్ ప్రారంభించారు. బుధవారం సింగరేణి పాఠశాల హై స్కూల్ మైదానంలో బెల్లంపల్లి, మందమర్రి ఏరియా బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఏరియా జీఎం జి దేవేందర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని, ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని తెలిపారు. పూర్తి స్థాయిలో ప్రతిభను చాటి కోల్ ఇండియా స్థాయిలో పతకాలను సాధించి సింగరేణి సంస్థకి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, సీఎంఓఏఐ సెక్రటరీ షైడిశ్వర్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డబ్ల్యూపిఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి కార్తీక్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్వైజర్ అశోక్, డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ కోఆర్డినేటర్ శివకృష్ణ, జనరల్ కెప్టెన్ శ్రీనివాసు, బిపిఏ కోఆర్డినేటర్ కిరణ్, బిపిఏ జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, గేమ్ కెప్టెన్లు వెంకటేశ్వర్లు, మురహరి పాల్గొన్నారు.



13 నుండి కన్వేయన్స్ డ్రైవర్ల నిరవధిక సమ్మె



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ డివిజన్‌లోని కన్వేయన్స్ డ్రైవర్లు సెప్టెంబర్ 13 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నారని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దుంపల శ్రీనివాస్ తెలిపారు. డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని బుధవారం జీఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఆర్పి ఓసిలో పనిచేస్తున్న కన్వేయన్స్ డ్రైవర్ల వేతనాల సమస్యలను, పని భద్రతను కల్పించాలని గత నెల 29న సింగరేణి అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. సింగరేణి అధికారులు మాత్రం ఇప్పటివరకు సమస్యను పరిష్కరించే విధంగా చొరవ చేయకపోవడం వల్ల ఈనెల 13వ తేదీ నుండి కన్వేయన్స్ డ్రైవర్లు నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నారని తెలిపారు. డ్రైవర్లు కోరేవి గొంతెమ్మ కోరికలు కావని, సింగరేణి యాజమాన్యం కన్వేయన్ డ్రైవర్లకు ఎంత వేతనం ఇవ్వాలో, బోనస్ ఎంత కట్టివాలో, సీఎం పిఎఫ్ ఎంత కట్ చేయాలో పూర్తి వివరాలతోనే టెండర్ ఇవ్వడం జరుగుతుందని, కానీ బినామీ ఓనర్లు సింగరేణి యాజమాన్యం ఇచ్చే హక్కులు ఏవి కూడా కార్మికులకు వర్తింప చేయకుండా, బినామీ ఓనర్ల ఖజానా నింపుకుంటున్నారన్నారు. ఏ కార్మికుడైన ఆ బినామీ ఓనర్లకు వ్యతిరేకంగా మాట్లాడిన, తన వేతనాల గురించి మాట్లాడిన నిర్దాక్షిణంగా విధుల నుండి తొలగిస్తున్నారని తెలిపారు. పని భద్రత కల్పించే విధంగా చర్యలు తీసుకొని డ్రైవర్లకు తగిన న్యాయం చేయాలని అధికారులను కోరారు. లేనియెడల 13 తేదీ నుండి నిరవధిక సమ్మెలో పాల్గొని, తమ సమస్య పరిష్కారం అయ్యేవరకు సమ్మెను కొనసాగిస్తారని పేర్కొన్నారు.

విద్యార్థులకు పోటీలు

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని కళాశాల విద్యార్థులకు ఉపన్యాస, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీలలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బాన భగవాండ్లు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన గొప్పరచయిత, స్వతంత్ర సమర యోధుడు కాళోజి నారాయణరావు అని అన్నారు. ఆయన జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవం జరుపడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమం సందర్భంగా తెలుగు అధ్యాపకురాలు రామాంజనిని కళాశాల బృందం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | సెప్టెంబర్ 12, 2024 | www.navatelangana.com

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

నవతెలంగాణ-నిర్మల్



జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రమాదవశాస్తూ విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందిన సంఘటన నిర్మల్ రూరల్ మండలం అనంతపేట గ్రామంలో చోటుచేసుకుంది. యజమాని బొబ్బిలి గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న మేతకు వెళ్లిన ఆవు రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో గ్రామ పరిసర ప్రాంతాల్లో వెతుకారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెంది కనిపించింది. భారీ వర్షాల కారణంగా ఎర్త్ వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో అటువైపు మేతకు వెళ్లిన పశువు విద్యుత్ షాక్‌తో మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశాడు. మృతి చెందిన ఆవు విలువ రూ.60 వేలు ఉంటుందని, పశుపోషనే ప్రధాన వృత్తిగా నమ్ముకుని తన కుటుంబం జీవనం సాగిస్తుందని తెలిపాడు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరాడు.

రేపు కళాశాలలో వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (సైన్సెస్)లో అప్‌గ్రాడ్ సహకారంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లలో శాశ్వత ప్రాతిపదికనకు ఈనెల 13న వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డా.సంగీత, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ ఐ.శ్రావణి, మెంటర్ ఇమ్రాన్, ప్లేస్మెటంట్ సెల్ కోఆర్డినేటర్ టి.మంజుల, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ యన్. శ్రీధరా దేవి బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10.30 నిమిషాల నుండి కళాశాల ప్రాంగణంలో ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయినవారికీ బ్యాంకులలో నెలకు రూ.20వేల జీతం పొందే అవకాశం ఉందన్నారు. ఏదైనా డిగ్రీ , బీటెక్‌లో 50శాతం మార్కులు కలిగి ఉండి 1994-2003 మధ్య జన్మించి 30 సంవత్సరాలలోపు వయసు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. కావున జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8106764653లను సంప్రదించాలని కోరారు.

మెడల్ అందుకున్న అధ్యాపకుడు చంద్రశేఖర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా కేంద్రానికి చెందిన ఓ అధ్యాపకుడు మెడల్ అందుకున్నారు. టీచర్స్ కాలనీకి చెందిన గాధరి చంద్రశేఖర్ ఉట్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. విధులు నిర్వర్తిస్తూనే ఖాళీ సమయంలో చిత్రలేఖనాన్ని అలవాటుగా చేసుకుని అద్భుతమైన చిత్రాలను గీస్తూ అబ్బుర పరుస్తూ అవార్డులను అందుకుంటున్నారు. పాఠశాల స్థాయి నుండి ఈ డ్రాయింగ్ పట్ల పట్టు సాధించి ఎన్నో విజయాలను సోంతం చేసుకున్నారు. తాజాగా ఇండియన్ ఆర్ట్ 12 నేషనల్ లెవెల్ కాంటెస్ట్‌లో పాల్గొన్నారు. పెన్సిల్ స్కెచ్ ఆర్ట్ అడల్ట్ విభాగంలో అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించి ప్రశంసా పత్రం, మెడల్ ను అందుకున్నారు. దీంతో పలువురు ఆయనను అభినందించారు.

ఉద్యోగులు నిత్య విద్యార్థులుగా మారాలి



నవతెలంగాణ-పెంబి

ఉద్యోగులు నిత్య విద్యార్థులుగా మారాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్ అన్నారు. మండలంలో వ్యవసాయ విస్తరణ అధికారిగా పనిచేస్తున్న రాజ్ కుమార్ ప్రతిష్టాత్మక నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ అగ్రికల్చర్ మేనేజ్మెంట్ కళాశాల (మేనేజ్) నుండి వ్యవసాయ విస్తరణ విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సును పూర్తిచేసుకున్నారు. బుధవారం ఆయనను వ్యవసాయ శాఖ కార్యాలయంలో అభినందించి వారికి సంబంధిత సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ ఉద్యోగులు తమ వృత్తి జీవితంలో నిత్య విద్యార్థులుగా మారాలని, కాలంతో పోటీ పడుతూ మారుతున్న సమయంతో పాటుగా అందివస్తున్న నూతన శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని సూచించారు. గతంలో విస్తరణ అధికారులు తాము పనిచేసిన మండలాల్లోని గిరిజన ప్రజల ఆదాయాన్ని పెంచే ఉద్దేశ్యంతో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం, హైదారాబాద్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో తేనెటీగల పెంపకానికి సంబంధించిన కోర్సును కూడా పూర్తి చేసుకుని వచ్చారని తెలిపారు.

విద్యార్థులకు యోగా శిక్షణ తరగతులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఒకరోజు యోగ శిక్షణ తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యోగ శిక్షకులు బి.తిరుపతి రెడ్డి, సంతోష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం పాల్గొన్నారు. వివిధ యోగ ఆసనాల వేస్తూ వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు. మానసిక ఒత్తిడి నుంచి శారీరక ధ్రుఢత్వం కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గణపతి రఘు, స్వప్న, పృథ్వి విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ రాయితీలను వినియోగించుకోవాలి

నవతెలంగాణ-తాంసి

ప్రయాణీలకు ఆర్టీసీ అందిస్తున్న రాయితీలను విద్యార్థులు, గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ వీటీఓ శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గమ్యం యాప్ రోడ్డు భద్రత నియమాలను సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉచిత బస్సు పాసులు, వికలాంగుల పాసులు వివాహాది శుభాకార్యాలకు రాయితీపై బస్సులు ఇవ్వడం జరుగుతుందన్నారు. గమ్యం యాప్ నుండి బస్సు టికెట్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం ఎంతో మేలని, శిక్షణ పొందిన డ్రైవర్లు ఉంటారన్నారు. ప్రతి ఒక్కరు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయాలన్నారు. కార్యక్రమంలో వీటీఓలు మధు, కండక్టర్ భూమన్న, హెచ్ఎం శ్రీకాంత్, ఉపాధ్యాయులు సతీష్, ఉమామహేశ్వర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రెసిడెంట్‌ను కలిసిన 'కంది'

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను అదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాసరెడ్డి హైదారాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్త అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో ఆయన మార్గదర్శకాలకనుగుణంగా నడుచుకుంటానని తెలిపారు. ఆయన సలహాలు సూచనలు పాటిస్తూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తగిన విధంగా కృషి చేస్తానన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు.

వసతి గృహ విద్యార్థులకు

మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా



నవతెలంగాణ-ఉట్నూర్

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం లక్కెట్టిపేట, యెందా ఆశ్రమ బాలురను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏమైనా మరమ్మతులుంటే తన దృష్టికి తెవాలన్నారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిలువకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో ఎన్‌సీసీ అభివృద్ధికి చర్యలు

- డిప్యూటీ డైరక్టర్ జనరల్ వీఎం రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి జిల్లాలో ఎన్సిసి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ డైరక్టర్ జనరల్ వీఎం రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 32 బెటాలియన్ ఎన్‌సీసీ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. జిల్లాలో పనిచేస్తున్న ఎన్‌సీసీ బృంధాల సంఖ్య వారికి అందిస్తున్న శిక్షణలు తదితర అంశాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలోని వివిధ విభాగాలు, రికార్డులను పరిశీలించారు. అంతకు ముందు జిల్లాకు వచ్చిన డైరక్టర్ జనరలు ఎన్‌సీసీ అధికారులు, కెడెట్లు సాదర స్వాగతం పలకగా అక్కడ సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. అనంతరం పట్టణంలోని ఎన్‌సీసీ అకాడమీ ఏర్పాటుకు స్థలపరిశీలనకు ఆయన స్థానిక ఎరోడ్రాంను సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ డిప్యుటీ డైరక్టర్ జనరల్ వీఎం రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎన్‌సీసీ బెటాలియన్ పటిష్టతకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలో ఎన్‌సీసీ అకాడమీ ఏర్పాటుకు సాధాసాధ్యాలను పరిశీలించేందుకు జిల్లా పర్యటనకు వచ్చినట్లు తెలియజేశారు. జిల్లాలోని ప్రతి కళాశాలలోనూ ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఏడీ కల్నల్ సంజయ్ గుప్తా, గ్రూప్ కమాండర్ కల్నల్ సునీల్ అబ్రహం, నిజామాబాద్ ఎన్‌సీసీ గ్రూప్ ట్రైనింగ్ ఆఫీసర్ కల్నల్ కౌస్తవ్ మహంతి, బెటాలియన్ అధికారి వికాస్ పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌నారాయణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఐఎఫ్టీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 13న నిజామాబాద్‌లో జరిగే సంఘం ప్రాంతీయ సదస్సును విజయవంతం చేయలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయొద్దని, మూడు క్రిమినల్ లాస్ బ్రిటిష్ నల్ల చట్టాలగా ఉన్నాయన్నారు. రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా 13న నిజామాబాద్‌లో ప్రాంతీయ సదస్సు జరగబోతుందని తెలిపారు. ఈ సదస్సుకు ఐఎఫ్టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులు ఎం.శ్రీనివాస్, ప్రముఖ లాయర్ మాదవరావు పాల్గొంటారన్నారు. సదస్సులో జిల్లాలోని సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఐఎఫ్టీయూ నాయకులు గౌరాల సుభాష్, శేశరావు, నర్సింగ్, దేవిదాస్, అఖిల్ పాల్గొన్నారు.

మైనారిటీ గురుకుల ఉపాధ్యాయునికి డాక్టరేట్



నవతెలంగాణ-ఇచ్చోడ

ఇచ్చోడ మైనార్టీ గురుకులంలోని పీజీటీ(బయోలజీ)గా విధులు నిర్వహిస్తున్న మొకిరాల మహేష్‌కు వృక్షశాస్త్ర విభాగంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ లభించింది. బుధవారం మండల కేంద్రంలో మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యూనిస్ సలీం, ఉపాద్యాయులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రిన్సిపాల్ యూనిస్ సలీమ్ మాట్లాడుతూ ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలన్నారు. డాక్టరేట్ పొందిన మహేష్ మాట్లాడుతూ ఈ విజయంలో సహకారం అందించిన ప్రొఫెసర్ కమలాకర్, అంతే కాకుండా వెన్నుదన్నుగా ఉన్న కుటుంబ సభ్యులకు, సహ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేశారు. మారుమూల గ్రామం నుండి పీహెచ్‌డీ పొందిన తొలి వ్యక్తిగా తను కావడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి ఇంతటి విజయాన్ని అందుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మైనార్టీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు నవీన్ కుమార్, ముజాహిద్ సయ్యద్, ఇలియాస్ అలీ, రాజశేఖర్ రెడ్డి, సుమన్, సంతోష్, ఉమాకాంత్, మహేందర్ పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో గణేష్ నిమజ్జనం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని హస్నాపూర్ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాల హెచ్ఎం రాథోడ్ మంగులాల్ ఆధ్వర్యంలో బుధవారం గణేష్ నిమజ్జన శోభాయాత్ర చేపట్టారు. ఐదు రోజుల పాటు పూజలు చేసిన విద్యార్థులు ఉత్సహంగా నృత్యాలు సమీపంలోని చెరువులో వినాయకున్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వార్డెన్ చవాన్ నెహ్రూ, రజినీకాంత్, సంతోష్, ప్రకాష్, నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పురుగులమందు తాగి విద్యార్థి ఆత్మహత్య



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని జీన్‌గూడ ఆదర్శ నగర్‌కు చెందిన రాజపంగే చందు(18) బుదవారం పురుగులమందు తాగి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందు కొన్ని నెలలుగా ఎవరితో మాట్లాడకుండా ఒంటరిగా ఉంటున్నాడు. మంగళవారం పురుగులమందు తాగి వాంతులు చేస్తూ తన సోదరునికి తెలిపాడు. కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించి ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి మెరుగైన చికిత్స కోసం తరిలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ గంగారెడ్డి తెలిపారు. కాగా మాజీ సర్పంచ్ గజానంద్ నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఖానాపూర్

హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కళాశాలకు తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ పేరు పెట్టడాన్ని హర్షిస్తూ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. బుధవారం పట్టణంలోని రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి ధన్యవాదలు తెలిపారు. చాకలి ఐలమ్మ మనమరాలు శ్వేతకు మహిళా కమిషన్ సభ్యులుగా అవకాశం కల్పించినందుకు సంఘం ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్, నాయకులు జన్నారపు శంకర్, పరిమి సురేష్, మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, నాయకులు తోట సత్యం, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్ఐకి సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహించి విరమణ పొందిన జహీరుద్దీన్ దంపతులకు పోలీస్ స్టేషన్‌లో సన్మాన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఫణిధర్ ఏఎస్ఐ జరుద్దీన్ దంపతులను సన్మానం చేసి మెమెంట్ అందజేశారు. అనంతరం ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సైలు ముజాహిద్, అంజమ్మ, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు సన్మానం



నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూరు సబ్ కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన యువరాజ్ మర్మాట్‌ని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ సబ్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువలతో సత్కరించి పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఉట్నూర్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రెవెన్యూ శాఖ నుండి సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా నాయకులు బాబా టైగర్, దుట మహేందర్, పవర్ క్రాంతి, సాజిద్, సిద్దిక్ పాల్గొన్నారు.

ఎంజేపీలో ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం స్పాట్ అడ్మిషన్లు ఈనెల 15 నుండి ప్రారంభమవుతాయని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విశ్వేశ్వర్ తెలిపారు. బైపీసీ గ్రూప్ మొదటి సంవత్సరంలో 20 సీట్లు, సీఈసీలో 16 సీట్లు, ఎంపీసీలో 4 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆయా గ్రూపులో చేరదలుచుకునే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, 3 జిరాక్స్ సెట్లతో కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంపై ఈ నెల 12న అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజలింగు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేతివృత్తుల ఆధారంగా జీవిస్తున్న బీసీ కులస్థులకు ఆర్థిక సాయం అందించే ఈ పథకం విధివిధానాలను వివరించనున్నట్లు తెలిపారు. వివిధ సంఘాల నాయకులు ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే సదస్సుకు హాజరుకావాలని సూచించారు.

నవతెలంగాణ
నవ్యతెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | సెప్టెంబర్ 12, 2024 | www.navatelangana.com

బస్టాండ్ కోసం స్థలం కేటాయించాలని వినతి

నవతెలంగాణ-దహెగాం



మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని మండల యువకులు కోరారు. బుధవారం తహసీల్దార్ కవితకు ఇదే విషయమై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుకులు మాట్లాడుతూ మండలంలో ప్రతినిత్యం 24 గ్రామపంచాయతీలకు సంబంధించిన ప్రజలే కాకుండా వివిధ ప్రాంతాల నుండి ఆయా అవసరాల నిమిత్తం ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రంలో బస్టాండ్ కోసం స్థలం కేటాయించాలని కోరారు. బస్టాండ్ లేక ప్రయాణికులు హోటళ్ల దుకాణ సముదాయాలు చెట్ల కింద నిలుచొని ఉండాల్సిన పరిస్థితి నెలకొందని, వెంటనే బస్టాండ్ నిర్మాణానికి స్థలం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో యువకులు కొండయ్య ప్రదీప్, తిరుపతి, బాబాజీ, సత్యనారాయణ, సుమిత్, కిరణ్, రాకేష్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాల కోసం ఒంటికాలిపై నిరసన

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ సామాజిక ఆస్పత్రిలో పనిచేస్తున్న సానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 3 నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ అన్నారు. బుధవారం ఆస్పత్రి ఎదుట ఒంటికాలుపై కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్ మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ గుర్తింపు కార్డ్‌తో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి, మెడికల్ కాంట్రాక్టు అవడ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆసిఫాబాద్ బ్రాంచ్ అధ్యక్షుడు శ్రీశైలం, కార్యదర్శి మల్లేష్, కోశాధికారి సత్తార్, కార్మికులు మురళి, మమత, నీల, గుణవంతరావు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతం ఉపాధ్యాయులతో సాధ్యం

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం ఉపాధ్యాయులతో సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కోవలక్ష్మీ అన్నారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచిన వారిని జిల్లా విద్యాధికారి అశోక్‌తో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులకు ఉంటుందన్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే జిల్లాలో ఎక్కువమంది ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని అన్నారు. వారందరికీ నాణ్యమైన విద్య అందించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయ బాబు, ప్రధానోపాధ్యాయుడు సుభాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాకు చెందిన ఇద్దరు పేద విద్యార్థులకు చదువుకు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే డీఎంఎఫ్టీ నిధుల నుండి ముఖ్య ప్రణాళిక అధికారి కోటయ్య నాయక్‌తో కలిసి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సిర్పూర్(యు) మండలం పూలారా గ్రామానికి చెందిన మర్సుకోల బాదిరావు కుమారుడు కృష్ణ బీటెక్ ప్రథమ సంవత్సరం ఐఐటీ రాయచూర్-కర్ణాటకలో, వాంకిడి మండల కేంద్రానికి చెందిన దుర్గం మహేందర్ కుమారుడు అర్జున్ బీటెక్ ప్రథమ సంవత్సరం ఐఐటీ జోద్‌పూర్‌లో చదువుతున్నారని, వీరి చదువుకు ల్యాప్ టాప్ కొనుగోలు చేసేందుకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున డీఎంఎఫ్టీ నిధుల నుండి ఆర్థిక సాయం క్రింద చెక్కులు అందజేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ యోగా పోటీలకు న్యాయ నిర్ణేతగా అలేఖ్య

నవతెలంగాణ-రెబ్బెన



ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయ్‌లో ఈనెల 23 నుండి 27 వరకు జరిగే 2024-25 ఆల్ ఇండియా పోలీస్ వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్ గేమ్స్ 2024లో యోగాసన ఈవెంట్‌కు న్యాయనిర్ణేతగా టెక్నికల్ అధికారి కేసరి అలేఖ్య ఎంపికయ్యారు. ఆమెను తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీధర్ రావు, జనరల్ సెక్రెటరీ నందనం కృపాకర్, ఆసిఫాబాద్ జిల్లా ప్రెసిడెంట్ కేసరి అంజనేయులు గౌడ్, జనరల్ సెక్రెటరీ కొలిపాక కిరణ్, కుమ్మరి మల్లేష్, గురువు రేవెల్లి రాజలింగం, పీఈటీ భాస్కర్ అభినందించారు.

మెడికల్ కాలేజీకి కొండ లక్ష్మణ్ బాపూజీగా నామకరణం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీకి కొండ లక్ష్మణ్ బాపూజీ నామకరణం చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ కోరారు. బుధవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య కొండ లక్ష్మణ్ బాపుజీ జిల్లాలోని వాంకిడి మండలంలో జన్మించి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాదనకు తన మంత్రి పదవీని కూడ త్యాగం చేసి స్వరాష్ట్ర ఆకాంక్షను ఢిల్లీకి వినిపించారన్నారు. జిల్లాలో ఉండి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణమన్నారు. జిల్లాలోని మెడికల్ కళాశాలకు బాపుజీని పేట్టేలా కృషి చేయాలని విన్నవించారు. ఈ విషయం సీఎం దృష్టికి తీసుకెళ్లి మెడికల్ కళాశాలకు ఆయన నామకరణం చేయించి ఈ నెల 27న కొండ లక్ష్మణ్ బాపుజీ జయంతికి అభిమానులకు కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం నాయకులు పిప్రే సాయి, నాగోశే బాలాజీ, వడై బాపూజీ ఉన్నారు.

18 నుండి డీఎడ్ పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఈ నెల 18 నుండి 2022-24 బ్యాచ్‌తో పాటు గత బ్యాచ్‌లలో ఒకసారి ఫెయిల్ అయిన అభ్యర్థులకు డీ.ఈఐ.ఈడీ. ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని డీఈఓ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న పేపర్-1, 19న పేపర్-2, 20న పేపర్-3, 21న పేపర్-4, 23న పేపర్-5, 24న పేపర్-6 నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్ మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశామని సకాలంలో పరీక్షకు హాజరు కావాలన్నారు.

ఈవీఎంల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

- జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ ధోత్రే



ఈవీఎంల భద్రతపై అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రక్షణ దిశగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రక్షణ దిశగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో భద్రపరిచిన 2024 పార్లమెంట్ ఎన్నికలలో ఉపయోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గదిని రాజకీయ పార్టీల సమక్షంలో తెరిచి బందోబస్తు మధ్య ఈవీఎంలను గోదాంకు తరలించి భద్రపరచడం జరుగుతుందని తెలిపారు. గోదాం వద్ద పటిష్టమైన భద్రత కల్పించడంతో పాటు సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి మధుకర్, సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీలో పార్టీలు సహకరించాలి

ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో అధికారులకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2025లో భాగంగా ఇంటింటా సర్వేపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారుల ఇంటింటా ఓటర్ల సర్వే 59 శాతం పూర్తి అయిందని, పూర్తి స్థాయిలో జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఇప్పటివరకు 699 మంది ఓటర్లు గ్రామాన్ని వదిలి వెళ్లారని, 992 మంది ఓటర్లు మరణించారని, 356 ఓటర్లు ఓటరు జాబితాలో ఫోటోలు సరిగా లేవని, 291 మంది ఓటర్లు రెండుసార్లు ఓటరు జాబితాలో ఉన్నారని బూత్ స్థాయి అధికారులు గుర్తించినట్లు తెలిపారు. ఈనెల 20లోగా ఇంటింటా సర్వేను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఒకే కుటుంబంలోని ఓటర్లను ఇంటి నెంబరు ప్రకారం ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చే విధంగా జాబితా రూపొందించడం జరుగుతుందని, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇంటింటా సర్వే కార్యక్రమంలో పాల్గొని అధికారులకు సహకరించి స్పష్టమైన జాబితా రూపొందించేందుకు కృషి చేయాలని కోరారు. బూత్ స్థాయి అధికారులు యాప్ ద్వారా వివరాలు పొందుపరుస్తున్నారని, వివరాల నమోదులో సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి మధుకర్, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ప్రయివేట్ ఆస్పత్రులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం భట్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించి ఆస్పత్రిలోని వార్డులు, ల్యాబ్, పరిసరాలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రయివేటు ఆస్పత్రి ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుండి ప్రజలు వివిధ రకాల వైద్య సేవలకు ప్రయివేట్ ఆస్పత్రులకు వస్తుంటారని, ప్రస్తుత వర్షాకాల నేపథ్యంలో రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత సరైన వైద్య చికిత్సలు అందించాలని ఆదేశించారు. విష జ్వరాల సంబంధిత వైద్య సేవలను అందించడంతో పాటు ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సేవల సంబంధిత ధరల పట్టికను ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నాస్‌లో జిల్లా అగ్రస్థానంలో నిలపాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశవ్యాప్తంగా నవంబర్ 19న నిర్వహించనున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే 2024లో జిల్లా అగ్రస్థానంలో నిలపాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే దేశ వ్యాప్తంగా నవంబర్ 19న నిర్వహించడం జరుగుతుందని, దీనిలో భాగంగా 3, 6, 9 తరగతుల విద్యార్థులకు కేంద్ర మానవ వనరుల షాక్ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహించడం జరుగుతుందన్నారు. రాండమైజేషన్‌లో 10 పాఠశాలలు ఎంపిక చేస్తారన్నారు. ఇందులో భాగంగా 3 మాక్ టెస్టులు నిర్వహించడంతో పాటు వారంతపు పరీక్షలు నిర్వహించి విద్యార్థులు నేషనల్ అచీవ్మెంట్ సర్వేలో అత్యున్నత ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్యను బోధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర విద్య శిక్షణ పరిశోధన సంస్థ రూపొందించిన మోడల్ ప్రశ్నపత్రాలను వినియోగించుకొని విద్యార్థులతో సాధన చేయించాలన్నారు. 10వ తరగతి ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని తెలిపారు. నాస్ 2021 ఫలితాల కంటే 2024లో నిర్వహించే సర్వే ఫలితాలలో జిల్లా అగ్రస్థానంలో ఉండేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ అబీద్ అలీ పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

- సహకరించాలని సీఐటీయూ నాయకుల విన్నపం



విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వరద బాధితుల కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్, మార్కెట్ ఏరియాలో వరద బాదితులకు అండగా దుకాణాలు తిరుగుతూ విరాళలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల్లో నష్టపోయిన ఖమ్మం, మహబూబాబాద్, విజయవాడలతో పాటు త్రిపుర రాష్ట్రంలోని కార్మిక కుంటుంబాలకు సహకారం అందించేందుకు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిధి సేకరిస్తున్నట్లు తెలిపారు. వరద బాధితులకు నిత్యావసర సరుకులను అందజేయనున్నామన్నారు. రాష్ట్ర కమిటీ గతంలో కేరళ రాష్ట్రంలో వాయనాడు వరద బాధితులకు కూడా కార్మికుల నుండి సేకరించిన రూ.7,00,000లు కేరళ సీఐటీయూ రాష్ట్ర కమిటీకి పంపించామన్నారు. సీఐటీయూ ఆర్థిక సమస్యలకే పరిమితం కాకుండా తన సామాజిక బాధ్యతను కూడ నేరవేరుస్తున్నదని, భవిష్యత్తులో కూడా ఈ కర్తవ్య సాధన కోసం సామాజిక స్పృహతో పని చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కమిటీ సభ్యులు ఫహీమ, నాయకులు పాల్గొన్నారు.

అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్
- ఘనంగా అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



అటవీ అమరుల చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న డీఎఫ్ఓ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివని జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ అన్నారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా బుధవారం జిల్లా కార్యాలయం ఆవరణలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ చేతిలో ప్రాణాలు కోల్పోయిన ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాస్ స్మరణార్థం ప్రతి సంవత్సరం అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో షేక్ హైదర్, గౌస్ మొహియుద్దీన్, కొండాల్ రావ్, శ్రీహరి అనే అటవీ అధికారులు విధి నిర్వహణలో వివిధ సంఘటనలలో మృతి చెందారన్నారు. తమ ప్రాణాలను లెక్కచేయకుండా కలప స్మగ్లర్లతో తీవ్రవాదులతో పోరాటం చేసి వారు చేసిన దాడులలో ప్రాణాలు కోల్పోయిన అటవీశాఖ అమరవీరుల అత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి సేవలను గుర్తు చేశారు. ఇప్పటివరకు 3 దశాబ్దాలలో దాదాపు 32 మంది అటవీ అధికారులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అడవుల సంరక్షణ తమ ప్రాణాలను కూడా లెక్కచేయకుండా ప్రాణ త్యాగం చేసిన అమరవీరులు ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయం అన్నారు. సిబ్బంది వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. అడవుల సంరక్షణలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ రేంజ్‌అధికారి గోవింద్ సింగ్ సర్దార్, డిప్యూటీ రేంజ్ అధికారులు యోగేష్, సరోజ రాణి, కార్యాలయ సిబ్బంది, జిల్లా, డివిజన్‌కు చెందిన అటవీ శాఖ సిబ్బంది, ఆసిఫాబాద్ రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు



నవతెలంగాణ-దహెగాం

గ్రామాల్లో అంటూ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి సజీవన్ అన్నారు. బుధవారం మండలంలోని ఇట్యాల, ఐనం గ్రామపంచాయతీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపడుతున్న క్లోరినేషన్ చర్యలు పారిశుధ్య చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా అంటూ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని ముందస్తుగా ప్రత్యేక శ్రద్ధ వహించి పారిశుధ్య చర్యలు చేపట్టడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే కమ్మర్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపును సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రతి ఒక్క అధికారి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రజలను అప్రమత్తత చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేందర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు

సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక కృషి

- ఎమ్మెల్యే కోవలక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అర్హులైన వారికి అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన వారు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసిఫాబాద్ మండలానికి చెందిన 129 మంది లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే తెలిపారు. కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, మాజీ సర్పంచులు భీమేష్, బాబురావు, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు రవీందర్, గోపాల్ పాల్గొన్నారు.

వాంకిడి : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే కోవలక్ష్మి 62 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు ఇవ్వడం జరుగుతుందని, చెక్కులు రానివారు బాధపడొద్దని, తిరిగి వారికి కూడా త్వరలోనే ఇవ్వడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ ఇంకా చాలా మందికి అందడం లేదని, ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రుణమాఫీ అందరికీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్టుతో పాటు వివిధ పథకాలను కూడా యధావిధిగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ రియాజ్ అలీ, సింగిల్ విండో చైర్మన్ జాబిరే పెంటు, మాజీ జడీపటీసీ అజయ్ కుమార్, మాజీ సర్పంచ్ బండె తుకారాం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్నులే నారాయణ, వివిధ పార్టీల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల కళాశాల పాఠశాలలో ప్రతిష్ఠించిన వినాయకుడి నిమజ్జనం ఘనంగా జరిగింది. ఐదు రోజులు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుడికి బుధవారం గురుకులం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిత ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తన సిబ్బందితో కలిసి డీజే పాటలతో శోభాయాత్రతో తుంపల్లి వాగులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మల్లీశ్వరి, పద్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



గణేష్ ఊరేగింపులకు డీజే అనుమతి లేదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండల పరిధిలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, నిమజ్జనం ఊరేగింపుకు డీజే అనుమతి లేదని సీఐ సతీష్ అన్నారు. బుధవారం డీజే నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు సూచనల మేరకు డీజే సౌండ్ సిస్టం ఎక్కడ అనుమతి లేదని, రానున్న గణేష్ నిమజ్జన కార్యక్రమంలో చాలామంది అనుమతి లేకుండా డీజే సిస్టం ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాలకు డీజే సౌండ్ సిస్టంని పెట్టరాదని, ఎవరైనా పెట్టితే నిర్వాహకులు, ఆర్గనైజర్లపై కేసు నమోదు చేయడమే కాకుండా వాటిని స్వాధీనం చేసుకుంటామన్నారు. అనంతరం డీజే నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సైలు పాల్గొన్నారు.

ఎన్ఎంఎస్ఎస్ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ అర్హత కోసం నిర్వహించే పరీక్షకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే గడువును ఈనెల 25 వరకు పొడగించినట్లు జిల్లా విద్యాధికారి అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబరు 25లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీఎస్ఈ.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి నవంబరు 24న పరీక్ష ఉంటుందన్నారు.

డీజే నిర్వాహకుల బైండోవర్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

డీజే నిర్వాహకులను బైండోవర్ చేసినట్టు లక్షెట్టిపేట ఎస్ఐ పి సతీష్ కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంతో పాటు మండలంలోని డీజే నిర్వహకులు సుమారు 8 మందిని అదుపులోకి తీసుకొని స్థానిక తహశీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. గణేష్ నిమార్జనంలో ఎవరు డీజే పెట్టకూడదని ప్రభుత్వం డీజేలకు అనుమతి ఇవ్వలేదని ఎవరైనా పెడితే సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

జన్నారం : పట్టణంతో పాటు మండలంలోని డీజే నిర్వహకులు సుమారు 8 మందిని అదుపులోకి తీసుకొని స్థానిక తహశీల్దార్ ముందు బైండోవర్ చేయడం జరిగిందని ఎస్ఐ రాజ వర్ధన్ తెలిపారు. గణేష్ నిమార్జనంలో ఎవరు డీజే పెట్టకూడదని ప్రభుత్వం డీజేలకు అనుమతి ఇవ్వలేదన్నారు. ఎవరైనా పెడితే సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పురుగుల మందు తాగి వ్యక్తి మండలోని ఎల్లారం గ్రామానికి చెందిన మొగిలి(46) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ పి సతీష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మొగిలి వృత్తి రిత్య ఆటోమొబైల్ వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారం కొనసాగించేందుకు అప్పులు చేశాడు. అవి కట్టలేక మనస్తాపానికి గురై ఈ నెల 9వ తేదిన సాయంత్రం తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకోగా కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరళించారు. పరిస్తితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరళించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య మమత పిర్యాదు మేరకు ఎస్ఐ-2 రామయ్య కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అమాయక మహిళలే టార్గెట్

● జిల్లాలో జోరుగా వ్యభిచార దందా ● లాడ్జీలో పలువురిని అరెస్టు చేసిన పోలీసులు



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో జోరుగా వ్యభిచార దందా కొనసాగుతుంది. హోటలళ్లు, లాడ్జ్, నివాస గృహాలు అడ్డాగా కొందరు నిర్వాహకులు ఈ దందా గుట్టు చప్పుడు కాకుండా కొనసాగిస్తున్నారు. అమాయక మహిళలను టార్గెట్ చేసుకొని వారికి డబ్బు ఎరగా వేసి వారిని ఈ కూపం లోకి లాగుతున్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, షార్ట్ ఫిలిమ్స్‌లో అవకాశాలు ఉన్నాయంటూ వారికి మాయ మాటలు చెప్పి వారిని వ్యభిచారంలోకి దించి అందిన కాడికి దండుకుంటున్నారు. నిర్వాహకులు డబ్బులు అవసరం ఉన్న మహిళలను ఇతర ప్రాంతాలకు తరలించి వారితో వ్యభిచారం చేపిస్తున్నారు. ఇష్ట రీతిలో జరుగుతున్న ఈ వ్యభిచార గృహలపై మంచిర్యాల పోలీసులు నిఘా పెట్టారు. ఇటీవల మూడు చోట్ల వ్యభిచార గృహాలపై దాడి చేసి విటులను, నిర్వాహకులను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. 20 రోజుల వ్యవధిలోనే మంచిర్యాల పట్టణంలో వ్యభిచారం నిర్వహించే ముఠాల గుట్టు రట్టు కావడంతో స్థానిక ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు.

మంగళవారం మంచిర్యాల పట్టణం లోని జన్మభూమి నగర్‌లో గల వెంకటేశ్వర లాడ్జ్‌లో తనిఖీలు చేసే క్రమంలో 6 గురు యువతులను, 6 గురు యువకులను అదుపులోకి తీసుకొని విచారించగా వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించారు. బుధవారం మంచిర్యాల పట్టణ సిఐ వివరాలు వెల్లడించారు. లాడ్జ్ వ్యవహారాలు చూసుకుంటున్న నెన్నెల మండలం జెండా వెంకటాపూర్‌కు చెందిన గోదారి దుర్గయ్య అతని భార్య శైలజ అమాయక మహిళలకు డబ్బు ఎరగా చూపి ఈ దందా లోకి లాగుతున్నట్లు తెలిపారు. ఉద్యోగాలు, షార్ట్ ఫిలిమ్స్‌లో అవకాశం ఇపిస్తామంటూ మహిళలకు మాయ మాటలు చెప్పి లాడ్జ్‌కి తీసుకొచ్చి వారితో వ్యబిచారం చేయిస్తూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నట్లు తేలిందన్నారు. తనిఖీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన విటులను పట్టుకొని విచారించగా వారు మంతెన శ్రావణ్, గాంధీనగర్, సీసీసీ నస్పూర్, బొడ్డుపల్లి శివకుమార్, పెద్దపల్లి, కూకట్ల పురుషోత్తం, సంపుటం, వేమనపల్లి, పెరుగు సాయిప్రసాద్ కోనంపేట, నెన్నెల్ మండలం, బెడ్డల రాహుల్, మెట్‌పల్లి, నెన్నెల్ కన్నం శ్రావణ్ కుమార్, మందమర్రిలతో పాటు లాడ్జ్ ఓనర్‌ను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.15 వేల నగదు, కండోమ్ పాకెట్స్, లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేసి ఆరుగురు విటులు, లాడ్జి ఓనర్, మేనేజర్‌లను న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టినట్లు తెలిపారు .

తీరు మార్చుకొని వ్యాపారి

మంచిర్యాల జిల్లా కేంద్రం బెల్లంపల్లి చౌరస్తా సమీపంలో గల ఓ లాడ్జీలో విచ్చలవిడిగా వ్యభిచారం నడుస్తోంది. 'జంటగా రండి... రూ.1,100 చెల్లించండి... రెండు గంటలు ఎంజాయ్ చేయండి' అంటూ లాడ్జీ ఓనర్ ఆఫర్ ప్రకటించడంతో డే అండ్ నైట్ ఆ లాడ్జీ కిటకిటలాడుతోంది. కొంతమంది యువకులతో పాటు అంకుల్స్ సైతం అమ్మాయిలతో వచ్చి గుడుపుతున్నారు. ఇట్టి సమాచారం అందుకున్న పోలీసులు లాడ్జిపై దాడి చేసి ఆరు జంటలను పట్టుకున్నారు. ఆరుగురు విటులతో పాటు లాడ్జీ మేనేజర్ను అరెస్టు చేసి, ఓనర్పై కేసు పెట్టారు. అమ్మాయిలను సఖి సెంటర్కు పంపారు. పట్టణానికి చెందిన సిరిపురం శ్రీనివాస్ బెల్లంపల్లి చౌరస్తా సమీపంలో సాయినాథ్ రెసిడెన్సీ నిర్వహిస్తున్నాడు. ఇందులో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారంతో గత వారం పోలీసులు లాడ్జీపై దాడి చేయగా ఆరు జంటలు పట్టుబడ్డాయని తెలిపారు. విటులు సుంకరి శివయ్య (ఆకెనపల్లి, బెల్లంపల్లి), మందాల శివ ఆశిష్ (గోదావరిఖని), గోస్కుల ప్రశాంత్ (వెల్గటూర్), ఆకుల ప్రశాంత్ (గోదావరిఖని), రౌతు కార్తీక్ (గోదావరిఖని), తిరుపతి (లక్సెట్టిపేట)లను అరెస్టు చేశామన్నారు. రూముల్లో మహిళలతో రెండు గంటలు గడపడానికి లాడ్జీ మేనేజ్మెంట్ రూ.1,100 వసూలు చేస్తోందన్నారు. డబ్బులు తీసుకొని వ్యభిచారాన్ని ప్రోత్సహిస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. మేనేజర్ మోటం జనార్ధన్ను సైతం అరెస్టు చేశామని తెలిపారు. లాడ్జీ ఓనర్ సిరిపురం శ్రీనివాస్ను త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. శ్రీనివాస్కు పట్టణంలో ప్రముఖుడిగా పేరుంది. గతంలో మంచిర్యాలలోని విశ్వనాథ ఆలయ కమిటీ చైర్మన్గా పనిచేశాడు. ఆయన రెండు నెలల కిందట ఇదే లాడ్జీలో వ్యభిచారం చేస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. అయినా తీరు మార్చుకోకుండా అదే దందా కొనసాగిస్తున్నాడు. లాడ్జీకి వచ్చే కొంతమంది మహిళలకు పైసలు ఆశచూపి వివిధ ప్రాంతాలకు కూడా పంపుతున్నట్టు విచారణలో తేలింది.



మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-బోథ్

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు రంగారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాబోయే వంట కొనుగోలు చేసేటప్పుడు రైతులకు అన్నివిధాల ఆదుకోవాలని అన్నారు. అలాగే రైతుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం జరుగుతుందన్నారు. రైతులకు పంట కొనుగోలు చేసే సమయంలో మౌళిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆడే వసంత్ రావు, సభ్యులు కత్తూరి విశ్వనాథ్, కత్తూరి మల్లేష్ పాల్గొన్నారు.

మాత ఆస్పత్రిలో మెరుగైన వైద్యం



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని మాత పిల్లల ఆస్పత్రిలో హైదరాబాద్ తరహాలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ శ్రీశైలం తెలిపారు. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్దపల్లికి చెందిన తిరుమల కరీంనగర్‌లోని ప్రయివేట్ అస్పత్రిలో గత నెల 26న డెలివరీ కాగా బాబు మగ శిశువుకు జన్మనిచ్చిందని, ఆ శిశువుకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉండటంతో హైద్రాబాద్‌కు వెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారని తెలిపారు. హైదరాబద్‌కు వెళ్లి ట్రీట్మెంట్ చేయించుకునే పరిస్థితి లేకపోవడంతో కుటుంబ సభ్యులు తమ ఆస్పత్రిని సంప్రదించారని పేర్కొన్నారు. శిశువును పరీక్షించి లంగ్స్‌లో సమస్య ఉందని సర్జరీ అవసరం పడుతుందని కుటుంబ సబ్యులకు తెలపడంతో కుటుంబ సభ్యుల కోరిక మేరకు బాబుకు లంగ్స్ సర్జరీ నిర్వహించినట్లు తెలిపారు. సర్జరీ అనంతరం 15 రోజులు బాబుని హాస్పిటల్‌లో అడ్మిట్ చేసుకొని సమయం ప్రకారం చికిత్స అందించడంతో బాబు సాధారణ స్థితికి వచ్చాడని తెలిపారు. బాబును బుధవారం డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ బాబు బ్రతకడేమో అనుకున్న కుటుంబానికి భరోసా ఇచ్చి బాబు పూర్తి ఆరోగ్య వంతుడిగా అయ్యేలా చికిత్స అందించిన డాక్టర్ శ్రీశైలంకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



నవతెలంగాణ-ఉట్నూర్

అత్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుదవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బంజారాల ఆధ్యాత్మిక దీక్ష గురువు ప్రేమ్ సింగ్ మహారాజ్ ఆశీర్వాదం తీసుకున్న ఎమ్మెల్యే అనంతరం మహారాజ్‌కి శాలువాలతో సన్మానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతు ప్రజల్లో భక్తి భవన పెంపొందించేందుకు శ్రీశ్రీశ్రీ సద్గురు ప్రేంసింగ్ మహారాజ్ చేస్తున్న కృషి అభినంద నీయమన్నారు. తన బోధనలను దేశమంత ప్రతి తండాలలో పర్యటిస్తూ జాతిని జాగృతం చేస్తూ బంజారాల సంస్కృతి సంప్రాదాయలను సంరక్షిస్తూ, సాంఘిక దురాచారాలను రుపుమాపేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మోతిరాం మహారాజ్, పవార్ దేవిదాస్, నరహరి దాస్ రాథోడ్, ప్రకాష్ రాథోడ్, దేవేందర్ రాథోడ్, సుధాం జాదవ్ ఉన్నారు.

పరిసర ప్రాంతాలకు కార్గో సేవలు

నవతెలంగాణ-తాండూర్

తాండూర్, తిర్యాణి, భీమిని, రెబ్బెన మండలాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తాండూర్ ఐబీ కేంద్రంలో టీఎస్ఆర్‌టీసీ కార్గో సేవలు ప్రారంభించిందని కార్గో మేనేజర్ బి పాల్ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన ఐబీ కేంద్రంలో కార్గో కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాండూర్ పరిసర ప్రాంతాల్లోని వస్తు రవాణా వినియోగదారుల సౌకర్యార్థం తాండూరు మండల కేంద్రంలో కార్గో సేవలు అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్గో ద్వారా అతి తక్కువ ధరకు వస్తు రవాణా చేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ రీజియన్ మెంబెర్స్ సాయన్న, రమేష్, ఎంప రావు, మల్లేష్. సిరంగ్ శంకర్, ఈసా పాల్గొన్నారు.

అంజనీపుత్ర సంస్థ సేవలు అభినందనీయం

● మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య



నవతెలంగాణ-మంచిర్యాల

అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సభ్యులు సంస్థ తరపున చేస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య పేర్కొన్నారు. బుధవారం అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, అంజనీపుత్ర సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్ మాట్లాడుతూ అంజనీపుత్ర యువత ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంజనీపుత్ర సంస్థ ఎండీ పిల్లి రవి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు ఎస్ కిషన్, సదానందం, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

ట్రెజరీ అధికారులపై కేంద్ర సమాచార కమిషన్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-జన్నారం

సమాచార హక్కు చట్టం-2005 అమలు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి దరఖాస్తుదారుడికి కోరిన సమాచారాన్ని ఇవ్వకుండా చట్టాన్ని ఉల్లంగించిన లక్షెట్టిపేట ఎస్టీఓ, మంచిర్యాల డీటీఓలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర సమాచార శాఖ కమిషనర్‌కు మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన మేకల అక్షయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. తాను దరఖాస్తులో కోరిన సమాచారాన్ని తనకు ఇప్పించాలని, సంబంధిత రికార్డుల తనిఖీ చేయుటకు తనకు అనుమతించాలన్నారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడిన సంబంధిత అధికారుల నుండి చట్టప్రకారం తనకు నష్టపరిహారాన్ని ఇప్పించాలని కోరుతున్నామన్నారు.

అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

● ఎఫ్ఆర్ఓ సుష్మారావు



నవతెలంగాణ-జన్నారం

అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎఫ్ఆర్ఓ సుష్మారావు అన్నారు. అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ విధుల్లో చాలామంది అమరులయ్యారని, వారి త్యాగాలను స్మరించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అటవీశాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రేండ్లగూడ గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా అన్ని బోర్లకు మరమ్మతులు చేయిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఉదయం ఆ గ్రామంలోని పలు కాలనీల్లో పాడైన బోర్లను పంచాయతీ కార్మికులతో బాగు చేయించారు. అలాగే అన్ని కాలనీల్లో చెత్తను ఎప్పటికప్పుడూ ఊరు శివారుకు తరలిస్తున్నామని, ప్రజలు ఇళ్ల పరిసరాల పరిశుభ్రతను పాటించాలని శ్రీనివాస్ సూచించారు.

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని భవిత కేంద్రంలో బుధవారం ఫిజియోతెరఫి సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ భవిత కేంద్రంలో 0-18 వయస్సు గల దివ్యంగా పిల్లలకు పిజియోథెరపీ సేవలు అందించడం జరుగుతుందన్నారు. భవిత కేంద్రంలో అందిస్తున్న సేవలు వినియోగించుకోవాలని కోరారు. నాడీ వ్యవస్థ లోపం, ఆర్థోపెడిక్ సమస్యలు గల పిల్లలను భవిత కేంద్రంకు తీసుకువచ్చి ఫిజియథెరపీ సేవలు వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ టీచర్స్ వెంకటేశ్వర్లు, సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు

నవతెలంగాణ-జన్నారం

పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో గల వినాయక మండపం వద్ద బుధవారం స్థానిక మహిళలు ఘనంగా సాముహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మాసం రాజన్న పురోహిత్ అధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున హాజరై కుంకుమ పూజ కార్యక్రమాలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కాలని వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసులు శాంతియుత మార్గంలో నడవాలి

● ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



జైనూర్ సంఘటనల దృష్ట్యా ఆదివాసీలు శాంతియుత మార్గములో నడవాలని ఎస్పీ గౌస్ ఆలం హితవు పలికారు. బుధవారం మండలం లోని కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో ఆదివాసీ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైనూర్ మండలములో ఆదివాసీ మహిళాపై జరిగిన అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడికి చట్ట పరమైన చర్యలు తీసుకోవడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా జైనూర్‌లో జరిగిన అల్లర్లపై దోషులు ఎంతటి వారైనా వదిలేది లేదన్నారు. చట్టం తన పని తాను చేసుకుబోతుందన్నారు. సోషల్ మీడియా, వాట్సాప్‌లో వచ్చే వదంతులు నమ్మవద్దని సూచించారు. వీటిలో షేర్ చేసే ప్రతి అంశం నిజం కాదన్నారు. ఆదివాసులు సంయమానం పాటించి, జరుప బోయే గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమములో ఆదివాసీ పెద్దలు సీడం భీంరావ్, బీఎడ్. ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, పటేల్ వెంకట్రావ్, చిన్ను పటేల్, జుగాది పటేల్ సార్ మేడి, డీఎస్పీ నాగేందర్, గిరిజన పెద్దలు పాల్గొన్నారు.

జాతీయ మాల మహానాడు సభ్యుల ఎంపిక





నవతెలంగాణ-నస్పూర్

జాతీయ మాల మహానాడు మంచిర్యాల నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి శ్రీనివాస్, అధికార ప్రతినిధిగా తలారి రాజును బుధవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్ తెలిపారు. వీరికి ఎంపిక పత్రాలను జై భీమ్ సైనిక దళ్ రాష్ట్ర కన్వీనర్ ఆశాది పురుషోత్తం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలితం శంకర్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల కోసం జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలను నిర్వహించి, నస్పూర్ అంబేద్కర్ మాల సంక్షేమ సంఘంలో కీలక పాత్ర పోషించి అంచలంచలుగా ఎదిగిన అనుభవం ఉందన్నారు. అదేవిధంగా రాజకీయ ప్రస్థానంలో మాజీ ఎంపీటీసీగా పనిచేసిన అనుభవం ఉందని, జాతీయ మాల మహానాడు సంఘం తరపున పోరాటాలు చేసి, అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నాయకులు ఉపాధ్యక్షుడు జె నర్సింగ్, మార్త కుమారస్వామి, జిల్లా కార్యదర్శి నాగుల దుర్గయ్య, సీనియర్ నాయకుడు మేడ రాజలింగు, సంయుక్త కార్యదర్శి నాగమల్ల ప్రకాష్, మంచిర్యాల నియోజవర్గం అధ్యక్షుడు గరిసె రామస్వామి, నాయకులు పుట్ట రవి, జై భీమ్ సైనిక్ దళ్ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు కాటం రాజు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి ఎంపీ సన్మానం

నవతెలంగాణ-బోథ్



మండలములోని సోనాల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు దశరథ్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంతో బుధవారం స్థానిక ఎంపీ గోడం నగేష్ సన్మానించారు. ఉపాధ్యాయ విధులు నిర్వర్తిస్తు సేవలు అందించినందుకు అభినందించారు. కార్యక్రమంలో మండలకన్వీనర్ బోర్ రవీందర్, నాయకులు సుభాష్ సూర్య, గులాబ్, ప్రశాంత్, రాజేశ్వర్, మురళీ, పోతన్న, రమేష్ పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించండి

నవతెలంగాణ-రెబ్బెన



అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, ఇల్లు ఇప్పించాలని సీనియర్ జర్నలిస్ట్ దీకొండ సంజీవ్ కుమార్ కోరారు. బుధవారం పాత్రికేయులతో కలిసి తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రెబ్బెన మండలం పత్రిక విలేకరులకు కొందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని, కొంతమంది ఇళ్లస్థలాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న జర్నలిస్తులు ఎంతోమంది ఉన్నారని వారికి ఇల్లు, ఇళ్ల స్థలాలు వచ్చే విధంగా చూడాలని కోరారు. జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చూస్తామని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పాత్రికేయులు సాయి బాబా, హరీష్ రెడ్డి, రాందాస్, అజయ్, రాజశేఖర్ ఉన్నారు.

చేప పిల్లల సరఫరా టెండర్లు పూర్తి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో చేప పిల్లల సరఫరాకు అనుమతులు మంజూరు చేసేందుకు వేసిన టెండర్లను జిల్లా కొనుగోలు కమిటీ చైర్‌పర్సన్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు సమక్షంలో తెరిచారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చేప పిల్లల సరఫరాకు నిర్వహించిన టెండర్ ప్రక్రియలో 4 బిడ్డర్లు పాల్గొనగా 2 అర్హత కలిగిన వారి బిడ్ తెరవడం జరిగిందని, త్వరలో వారి అర్హతను బట్టి చేప పిల్లల సరఫరాకు అనుమతి మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి సాంబశివరావు, పశు సంవర్ధక శాఖాధికారి సురేశ్ పాల్గొన్నారు.

గణేష్ పూజలో పాల్గొన్న కలెక్టర్ ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గణేష్ నవరాత్రుల్లో భాగంగా పట్టణ కేంద్రంలోని కుమార్ జనతా గణేష్ మండలి వద్ద ఉన్న 52 అడుగుల ఎత్తైన గణపతి వద్ద పూజ కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని ఉత్సవ కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానం పలికి పూజా కార్యక్రమాలు చేయించారు. అనంతరం అధికారులకు శాలువాతో సత్కరించారు.

16 నుంచి 4.0 స్పెషల్ క్యాంపెయిన్



నవతెలంగాణ-రెబ్బెన

ఈనెల 16 నుంచి 30 వరకు స్పెషల్ క్యాంపెయిన్ 4.0 నిర్వహించడం జరుగుతుందని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం జీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. స్పెషల్ కాంపెయిన్ 4.0(స్వచ్ఛత) కార్యక్రమాన్ని బెల్లంపల్లి ఏరియాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. రెండు విడతల్లో నిర్వహించేల ప్రణాళికలు చేశారన్నారు. మొదటగా ఈ నెల 16 నుండి 30 వరకు సన్నాహక కార్యక్రమాలు, అక్టోబర్ 2 నుండి 31 వరకు రెండవ విడతలో కార్యక్రమాలుంటాయని తెలిపారు. ఏరియాలో పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సూచించారు. స్వచ్ఛతలో మొదటి స్థానం వచ్చేలా ప్రతి ఉద్యోగి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కె రాజమల్లు, ఖైర్‌గూడ పీఓ ఎం నరేందర్, ఏరియా ఇంజినీర్ భీం రావ్ జాడే, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనంలో అలరించిన విద్యార్థుల నృత్యాలు



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని విజేత స్కూల్‌లో ప్రతిష్ఠించిన గణపతి నిమజ్జనం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాలలో పూజాకార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అన్నదానం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గణనాథున్ని ఉంచి ప్రధాన కూడళ్లలో విద్యార్థులు నృత్యాలు చేస్తూ ముందుకు కదిలారు. పాటలకు అనుగుణంగా విద్యార్థులు నృత్యాలు చేస్తు అలరించారు. కుడి చెరువులో గణపయ్యను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సుఖేష్, నవీన్, సతీష్, రాజశేఖర్, చంద్రకళ, నాగమణి, ప్రతిభా భారతి, సుమలత, నిఖిల, శరణ్య, సుష్మిత విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన పోశెట్టి(32) మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది బుధవారం గ్రామ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్ఐ దిగంబర్ తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

మురుగు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టండి

• జెడ్పీ సీఈఓ గణపతి

నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల పరిధిలో ఎక్కడ కూడా మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ సీఈఓ గణపతి ఆదేశించారు. మండలంలోని ముదిగుంట, మిట్టపల్లి, కానుకూరు గ్రామాలలో బుధవారం పర్యటించి పారిశుధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. పంచాయతీలలో నీటి కుంటలను గుర్తించి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వాటర్ లీకేజీలు గుర్తించి వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయించాలని, దోమల వ్యాప్తిని నివారించడం కోసం ఫాగింగ్ చేపట్టాలని సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం మిట్టపల్లి గ్రామంలో గల ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రం సందర్శించి వైద్య సేవలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణగౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలి

• కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారాన్ని సకాలంలో అందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆశ్రమోన్నత బాలుర పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, భోజనశాల, మూత్రశాలలు, వాటర్ ట్యాంక్, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని తెలిపారు. విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యమైన నిత్యవసర వస్తువులు, తాజా కూరగాయలు వినియోగించాలని, ప్రభుత్వం అందించిన మెనూ తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేసి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని తెలిపారు. హరితహారంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. నూతనంగా మంజూరైన పాఠశాల భవనాల నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, వార్డెన్ కిషన్, పీడీ మధుసూదన్, ఉపాధ్యాయులు జాదవ్ కిరణ్ కుమార్, ప్రేమలత, అనిత, లక్ష్మీనారాయణ, గోపాల్, జాగేశ్వర్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణకు సమిష్టిగా కృషి చేయాలి

• జిల్లా జడ్జి ఎంవీ.రమేష్ బాబు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో డ్రగ్స్, మాదకద్రవ్యాల నివారణపై సమిష్టిగా కృషి చేద్దామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ. రమేష్ బాబు అన్నారు. బుధవారం జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా సీనియర్ సివిల్ జడ్జీ కమ్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యువరాజతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత భవిష్యత్తుపై మాదకద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలని, గుట్కా, సిగరెట్, ఆల్కహాల్, గంజాయి, ఇతర డ్రగ్స్ తీసుకోవడం వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వీటికి బానిసలైన వారు క్షణికావేశంలో అనాలోచిత పరిస్థితులలో నేరాలకు పాల్పడుతూ శిక్షలు అనుభవిస్తున్నారన్నారు. ఆసిఫాబాద్ లాంటి మారుమూల జిల్లాలో సాంకేతికతను ఉపయోగించి మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ చర్యలపై గ్రామాలలో అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అలవాటుకు దూరంగా ఉండాలని, మొదట చిన్నగా ప్రారంభించి తర్వాత బానిసలుగా మారుతున్నారన్నారు. వీటిని నియంత్రించేందుకు గ్రామాలలో మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించడంతో పాటు బ్రహ్మకుమారీల సహకారం తీసుకొని ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లలో మద్యానికి బానిసలైన వారి సంక్షేమం కోసం పునరావాస కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ నుండి కలక్టరేట్ వరకు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రధాన శిక్షకురాలు మనీష అధ్యక్షతన నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీని ఆసిఫాబాద్ సీఐ సతీష్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, సభ్యులు, బ్రహ్మకుమారిలు పద్మ, విద్యార్థులు, ఉద్యోగులు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

• కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో ఆధార్ సెంటర్లు లేనిమండలాల్లో కొత్త ఆధార్ సెంటర్లు వచ్చే విధంగా చూడాలని కలెక్టర్ రాజర్షి షా రాష్ట్ర యూఐడీఏఐసీ ఆదేశించారు. బుధవారంకలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నాల్గవ డిస్ట్రిక్ట్ లెవెల్ ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన మండలాలలో జరుగుతున్నటువంటి పీవీటీజీ పీఎం జన్మన్‌లో భాగంగా ఇంకా మిగిలి ఉన్న ఎన్‌రోల్మెంట్స్‌ని తొందరగా పూర్తి చేయాలని సూచించారు. 10 సంవత్సరాల దాటిన వారందరూ ఆధార్‌ని దగ్గర్లో ఉన్న ఆధార్ సెంటర్‌లో అప్‌డేట్ చేసుకోవాలని కమిటీ సభ్యులు వారి పరిధిలో దీనిపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, అడిషనల్ ఎస్పీ సురేందర్ రావు, అసిస్టెంట్ కలెక్టర్ అభిగ్యాన్ మలవియ, డీఎస్పీజీవన్ రెడ్డి, రాష్ట్ర యూఐడీఏ అసిస్టెంట్ మేనేజర్ మహమ్మద్ సహెూబన్, ఎల్‌డీఎం, అధికారులు పాల్గొన్నారు.

తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు లభ్యం

• కలెక్టర్ రాజర్షి షా
• ఎస్‌పీసీ క్యాంటీన్ ప్రారంభించిన కలెక్టర్,ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పోలీసు సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన సబ్సిడరీ పోలీస్ క్యాంటీన్ (ఎస్‌పీసీ) ద్వారా తక్కువ ధరలకే నిత్యావసర సరకులు దొరుకుతాయని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో గల చక్రపాణి మెమోరియల్ హాల్ వద్ద ఎస్పీ గౌష్ ఆలం, రెండవ బెటాలియన్ కమాండెడ్ నితికా పంత్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లోని నిత్యావసర సరుకులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్తువులు తక్కువ ధరలకే లభిస్తాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని పోలీసు యంత్రాంగం దిన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దాదాపు 1500 కుటుంబాలు జిల్లా పోలీసు యంత్రాంగానికి ఈ క్యాంటీన్ ఉపయోగపడుతుందని తెలిపారు.

వరద బాధితులకు తాడిపత్రుల పంపిణీ

నవతెలంగాణ-బేల

వారం రోజుల క్రితం జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన బాధితుల పట్ల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఔదార్యం చాటుకున్నారు. మండలంలోని గణేష్‌పూర్ గ్రామ పంచాయతీలో గల కడ్కి గ్రామంలో వరదలతో గుడిసెలు, ఇండ్లు కూలిపోయి బాధపడుతున్న ఆదివాసీ పేద కుటుంబాలను గుర్తించి బుధవారం మండల రెడ్ క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్ సామ రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో తాడిపత్రులను పంపిణీ చేశారు. వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ గంగేశ్వర్, సామ రూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆదివాసీ కుటుంబాలకు రెడ్ క్రాస్ సొసైటీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసిన తమ ఇంటి పైకప్పులకు ప్రమాదం లేకుండా ఉండేందుకు తాడిపత్రులను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు విజయ్‌బాబు, కోఆర్డినేటర్‌లు దొంతుల ప్రవీణ్, నరేష్, బోక్రే శంకర్, రాక్రే సాగర్, కన్య రాజు, గ్రామస్తులు హుస్సేన్ పటేల్, సోను పాల్గొన్నారు.



రైలు నుండి పడి గుర్తు తెలియని యువకుడు మృతి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



సిర్పూర్ మకోడి రైల్వే స్టేషన్ మధ్యలో గుర్తు తెలియని యువకుడు రైలు నుండి పడి మృతి చెందినట్లు రైల్వే జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్ గౌడ్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు సిర్పూర్ టౌన్ మకోడి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని మృత దేహం ఉందని సమాచారం వచ్చిందన్నారు. యువకుని వయస్సు 25 నుండి 30 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతిచెందిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, తెల్లని రౌండ్ నెక్ ఫుల్ టీ షర్ట్ బ్లాక్ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రిలో భద్రపరచడం జరిగిందన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే 9948481902, 8712658605లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

• ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-దస్తురాబాద్

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ గోడతో పాటు గ్రౌండ్ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి పాటుపడుతోందని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలను నెలకొల్పి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య అందే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దుర్గం మల్లేష్, గుండా నరేష్, రమేష్‌రావు, కిషన్, పుల్యానాయక్, దాసరి సత్తన్న, వెంకన్న గోపాల్ పాల్గొన్నారు.

శ్రీనివాస్ మృతిని గని ప్రమాదంగా పరిగణించాలి

నవతెలంగాణ-జైపూర్

ఇందారం-1ఏ గనిలో మృతి చెందిన అలవేణి శ్రీనివాస్ మృతిని గని ప్రమాదంగా పరిగణించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే శ్రీనివాస్ మృతి చెందాడని, రక్షణ విషయంలో యాజమాన్యం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గని ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సేఫ్టీ విషయమై ప్రతి నెల సమావేశాలు ఏర్పాటు చేసి కార్మికులకు సరైన అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్మిక సంఘాలు యాజమాన్యం చేసే తప్పిదాలను వ్యతిరేకించకపోవడం అనుకూలమవుతోందన్నారు. ఏరియా సేఫ్టీ జనరల్ మేనేజర్లు, కార్పొరేట్ సేఫ్టీ జనరల్ మేనేజర్లు నిరంతరం పని స్థలాలను పరిశీలించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టడం కోసం సంబంధిత అధికారులను ఆదేశించాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్ మృతిని గని ప్రమాదంగా గుర్తించి కుటుంబానికి అందాల్సిన బెన్ఫిట్స్ వెంటనే చెల్లించాలని కోరారు. అదే విధంగా మృతుడి కుటుంబానికి డిపెండెంట్ సూటెబుల్ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జైలు శిక్ష

నవతెలంగాణ-జైపూర్



మద్యం మత్తులో అవసరంగా 100 నెంబర్‌కు డయల్ చేస్తున్న రసూల్‌పల్లి గ్రామానికి చెందిన కోమటి రాజుకు 7రోజుల జైలు శిక్ష పడిందని ఎస్సై శ్రీధర్ తెలిపారు. అతిగా మద్యం సేవించి తరచూ 100 నెంబర్‌కు డయల్ చేయడమే కాకుండా గ్రామంలో న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్నందున కేసు నమోదు చేసి చెన్నూర్ కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఈ మేరకు చెన్నూర్ కోర్టు న్యాయమూర్తి రవి కోమటి రాజుకు 7 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు..

పారిశుధ్య పనులను వేగవంతం చేయాలి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని డీఆర్‌డీఓ, మండల ప్రత్యేక అధికారి కిషన్ అన్నారు. బుధవారం మండలంలోని రాంపూర్, తిమ్మాపూర్, తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఎంపీడీఓ శశికళ, ఎంపీఈఓ జలంధర్ పంచాయతీ కార్యదర్శులు లావణ్య ఉన్నారు.

